నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మున్సిపాలిటీ, మండల పరిధిలోని వార్డులు, గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. మంగళవారం ముచ్చింతల్, జూకల్‌లో 4న శంకరాపురం, నర్కూడలో 5న గొల్లపల్లి, సుల్తాన్‌పల్లిలో 6న ఘాంసిమియాగూడ, కాచారంలో 9న పెద్దగోల్కొండ, రషీద్ గూడలో 10న శంషాబాద్, రామంజాపూర్‌లో 11న పెద్దషాపూర్, పాల్మాకులలో 12న మదన్‌పల్లి, పెద్దతూప్రలో 13న తొండుపల్లి, చిన్నగోల్కొండలో 16న సాతంరాయి, చౌదరిగూడలో 17న ఊట్‌పల్లి, ననాజీపూర్‌లో, 18న బహదూర్‌గూడ, హమీదుల్లానగర్‌లో 19న కొత్వాల్‌గూడ, మల్కారంలో రెవెన్యూ సదస్సులు ఉంటాయి. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ ఆధ్వర్యంలో రెండు టీంలుగా ఆయా ప్రాంతాల్లో వీటిని నిర్వహిస్తారు.

సర్కారు బడుల్లో చేరండి

ఎంఈఓ లక్ష్మణ్ నాయక్



పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓ లక్ష్మణ్ నాయక్

శంషాబాద్: శంషాబాద్ మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, వర్కు పుస్తకాలు, నోటు బుక్కులతో పాటు యూనిఫాంలను ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ సోమవారం సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన ఉచిత విద్యతో పాటు పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందుతాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన సూచించారు.

సాగులో యాజమాన్య పద్ధతులపై సదస్సు

శంషాబాద్ రూరల్: రైతులు సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై మండలంలోని నర్కూడలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ బి.భార్గవి, డాక్టర్ ప్రియ పి.గౌరవ్, డాక్టర్ నాగరాజు కుమార్, డాక్టర్ ఎస్.దిలీప్, డాక్టర్ గౌతం వీర్ చౌహాన్, నర్కూడ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఏఓ శ్వేత, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ బి.సతీష్, ఏఈఓ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘మనూ’లో ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రవేశాలు

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఎంఏ కోర్సుకు మెరిట్ ఆధారంగా ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెడ్ డాక్టర్ సయ్యద్ నజీవుల్లా సోమవారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తును సమర్పించడానికి చివరి తేదీ జూన్ 4 అని ఆయన పేర్కొన్నారు. గుర్తింపు పొందిన సంస్థ/విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమానం కలిగి ఉన్న అభ్యర్థులు, 10వ/12వ/గ్రాడ్యుయేషన్ స్థాయి లేదా మనూ ఆమోదించిన ఉర్దూ బోధనా మాధ్యమంతో సమాన మైన మదర్సా కోర్సులలో ఉర్దూను ఒక సబ్జెక్టు/భాషగా లేదా మాధ్యమంగా చదివిన వారు ప్రవేశానికి అర్హులని ఆయన వివరించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఫారమ్‌లు, ప్రాస్పెక్టస్‌లను యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు కట్టమైసమ్మ బోనాలు

లంగర్‌హౌస్: అమ్మవారి శాంతి కోసం భవిష్యవాణిలో చెప్పినట్లుగా లంగర్‌హౌస్ వాసులు నేడు కట్టమైసమ్మకు బోనాలు సమర్పించాలని బుజిలీ మహంకాళి ఆలయ చైర్మన్ బోగి పరమేష్ కుమార్ అన్నారు. లంగర్‌హౌస్‌లోని కట్టమైసమ్మ ఆలయ పునర్నిర్మాణం, అమ్మవారి నూతన విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బోగి పరమేష్ కుమార్ మాట్లాడుతూ..గతంలో బోనాల సందర్భంగా రంగం సమయంలో భవిష్యవాణిలో అమ్మవారు కట్టమైసమ్మ ఆలయం అభివృద్ధి మరిచారని కోపోద్రిక్తులయ్యారన్నారు. ఆమె ఆదేశాల మేరకు ప్రస్తుతం ఆలయాన్ని అభివృద్ధి చేసి పునఃప్రతిష్ఠ చేస్తున్నామన్నారు. మంగళవారం అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, బోనాల సమర్పణ ఉంటుందని లంగర్‌హౌస్ వాసులు బంధుమిత్రుల సమేతంగా అమ్మవారికి బోనాలు సమర్పించాలన్నారు. ఈ ప్రతేక పూజల్లో మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, వరదరాజ్, మధు, శివశంకర్, ఇంద్రసేనారెడ్డి, సర్విన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు

- ఇప్పటికే 50 శాతం తీసుకెళ్లిన ఉపాధ్యాయులు
- ముమ్మరంగా అడ్మిషన్ల ప్రక్రియ
- 12 నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- 6వ తేదీ నుంచి బడిబాటకు శ్రీకారం



గోడౌన్‌లో పాఠ్య పుస్తకాలు

రాజేంద్రనగర్: ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలకు ఉచిత పాఠ్య పుస్తకాలు చేరుతున్నాయి. మండల కేంద్రంలోని గోదాముల నుంచి ఈ పాఠ్య పుస్తకాలను ఉపాధ్యాయులు తమతమ పాఠశాలలకు తరలిస్తున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో గండిపేట్, శంషాబాద్, రాజేంద్రనగర్ మూడు మండలాలు ఉన్నాయి. ఈ మూడు మండలాల పరిధిలో 144 యూపీఎస్, ప్రైమరీ స్కూల్, హై స్కూల్‌లు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో మొత్తం 27 వేలకు పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వం



పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు తరలిస్తున్న ఉపాధ్యాయులు

ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందజేస్తుంది.

- రాజేంద్రనగర్ మండల పరిధిలో మొత్తం 48 పాఠశాలలుండగా... 11 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరికి రాజేంద్రనగర్‌లోని ఎంఈఓ కార్యాలయం నుంచి పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు.
- గండిపేట్ మండల పరిధిలో 28 పాఠశాలల్లో 8 వేలకు పైగా విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఈ పాఠశాలలకు కిస్మత్‌పూర్‌లోని పాఠశాల గోడౌన్ నుంచి పుస్తకాలను రవాణా చేస్తున్నారు. అలాగే శంషాబాద్ మండలంలో 68 పాఠశాలలు ఉండగా... ఇక్కడ 9 వేల మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి శంషాబాద్‌లోని గోడౌన్ నుంచి ఉపాధ్యాయులు తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠ్య పుస్తకాలను తీసుకుంటున్నారు.

ఇప్పటికే 50 శాతం పూర్తి...

రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని 144 ప్రభుత్వ పాఠశాలల్లోని అధ్యాపకులు తమకు కేటాయించిన గోడౌన్‌ల ద్వారా పాఠ్య పుస్తకాలను స్వీకరిస్తున్నారు. సోమవారం సాయంత్రానికి సగానికి పైగా పాఠశాలల ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠ్య పుస్తకాలను స్వీకరించారు. మరో రెండు, మూడు రోజుల్లో నూటికి నూరు శాతం పాఠశాలలకు పుస్తకాలను అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రారంభమైన అడ్మిషన్లు...

ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేర్చుకునేందుకు గాను బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ బడిబాట కార్యక్రమం ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రతి శుక్రవారం ఉపాధ్యాయులు తమ పాఠశాల పరిసరాల్లో బడిబాట కార్యక్రమం కోసం పెద్ద ఎత్తున ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. బడిబాట కోసం ప్రత్యేకంగా బ్యానర్లు, పోస్టర్లను సైతం ఉపాధ్యాయులు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రచారం కొనసాగించేందుకు చర్యలు ప్రారంభించారు.

వందరోజుల ప్రణాళిక విజయవంతం చేయాలి

- శంషాబాద్‌ను స్వచ్ఛమైన పట్టణంగా మార్చుకోవాలి
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్: శంషాబాద్‌ను స్వచ్ఛమైన.. పరిశుభ్రమైన పట్టణంగా మార్చుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించిన వంద రోజుల ప్రణాళికను విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సూచించారు. శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ బి. సుమన్ రావు అధ్యక్షతన మండలి భవనంలో ఏర్పాటు చేసిన ప్రతిజ్ఞా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వంద రోజుల ప్రణాళికలో పరిశుభ్రత చర్యలు, పచ్చదనం, కాలుష్య నివారణ, ప్లాస్టిక్ నిషేధం వంటి ఎన్నో మంచి కార్యక్రమాలు ఉన్నాయన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రజలందరు భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని విజయవతం చేయాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు అన్ని పథకాలను అందజేస్తుందన్నారు. పర్యావరణహితంగా వ్యవహరించిన వాటర్‌మెన్ నాగేష్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. మున్సిపల్ మేనేజర్ శ్రావణి, మాజీ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు నంజయ్‌యాదవ్, వై.కుమార్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి మైలారం సులోచన, స్థానిక నేతలు తోకల మురళి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

బస్టాప్ కాముని చెరువు రోడ్డుకు మార్పు



బస్సులు నిలిపేందుకు పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్, ఆర్టీసీ అధికారులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో జఠిలమైన ట్రాఫిక్ సమస్యకు పరిష్కార దిశగా ట్రాఫిక్ పోలీసులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని సవేరా వద్ద ఉన్న బస్టాప్‌ను కాముని చెరువు వద్దకు మార్పుచేయడానికి ఏర్పాట్లు చేశారు. ‘సాక్షి’ దినపత్రిలో గత సోమవారం వచ్చిన ‘శంషాబాద్‌లో ట్రాఫికర్’ అనే శీర్షికన ప్రచురితమైన కథనంతో కదిలిన ట్రాఫిక్ పోలీసులు రాజేంద్రనగర్ ఆర్టీసీ అధికారులతో చర్చించారు. ప్రధానంగా సవేరా వద్ద ఉన్న మలుపు వద్దే బస్సులు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో పాతపోలీస్‌స్టేషన్ వైపు నుంచి వచ్చే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. దీంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ట్రాఫిక్ సీఐ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మరోసారి రాజేంద్రనగర్ ఆర్టీసీ అధికారులతో కలిసి ట్రాఫిక్ సమస్యను పరిశీలించారు. మంగళవారం నుంచి సవేరా వద్ద నిలిపివేస్తున్న బస్సులు కాముని చెరువు రోడ్డు వద్ద నిలిపివేస్తున్నట్లు ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్ వెల్లడించారు. దీనిని ప్రయాణికులు గమనించాలని సూచించారు.

నైపుణ్యం కల్గిన యువతతోనే వికసిత భారత్



శిక్షణార్థులతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

- భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- భూభారతి చట్టంతో సమస్యలు తొలగాలని ఆకాంక్ష

శంషాబాద్ రూరల్: దేశాభివృద్ధిలో తమ భాగస్వామ్యం ఏమిటో ప్రతి పౌరుడు ఆత్మ విమర్శ చేసుకోవాలి.. నైపుణ్యం కల్గిన యువతరమే వికసిత భారతానికి బాటలు వేయగలదని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో సోమవారం శిక్షణార్థులతో ఆయన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రస్టు శిక్షణార్థులు, భూభరతి లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు, మహిళలు, యువత అభివృద్ధిపై స్వర్ణ భారత్ ట్రస్టు ప్రధాన దృష్టి పెట్టిందన్నారు. ఒక పూట అన్నం పెట్టడం కాకుండా.. స్వశక్తితో రోజూ ఆహారాన్ని సమకూర్చుకునేలా నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నిత్య జీవితంలో యోగా, ధ్యానం, ఆరోగ్యకర ఆహారాన్ని జీవన విధానంగా చేసుకోవాలని సూచించారు.

జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్‌కు అభినందన

మణికొండ: జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో మణికొండకు చెందిన విద్యార్థి 247వ ర్యాంక్ సాధించటంతో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు. మణికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బి.కృష్ణారెడ్డి, పారిజాత కుమారుడైన బి.వెంకటసిద్ధార్థరెడ్డి ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 99.966 పర్సంటైల్‌తో 247వ ర్యాంకును సాధించాడు. విషయం తెలుసుకుని వైస్ చైర్మన్ అక్కడికి చేరుకొని విద్యార్థికి మిఠాయిలు తినిపించి అభినందించారు. బీజేపీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాంకర్‌కు స్వీట్ తినిపించిన నరేందర్‌రెడ్డి

రైతులకు నాణ్యమైన వరి విత్తనాల కిట్‌ల పంపిణీ

శంషాబాద్ రూరల్: ‘గ్రామ గ్రామానికి వ్యవసాయ విశ్వ విద్యాలయం నాణ్యమైన విత్తన పంపిణీ’ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రైతులకు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ విత్తనాల కిట్‌లను అందజేశారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద కేఎన్ఎం 1638 వరి రకం విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. రైతులు నాణ్యమైన విత్తనాల సాగుతో అధిక దిగుబడి పొందవచ్చని ఎమ్మెల్యే సూచించారు. రైతులు పండించిన తర్వాత వీటిని గ్రామాల్లోని మిగతా రైతులకు విత్తనం కోసం ఇవ్వాలన్నారు. మండలంలోని 19 గ్రామాలకు ముగ్గురు రైతుల చొప్పున వరి విత్తనాల కిట్లను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయధికారి శ్వేత తెలిపారు. ఒక్కో రైతుకు పది కిలోల వరి విత్తనాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఏడీ కవిత, తదితరులు పాల్గొన్నారు.



కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నేడు బక్రీద్ ఏర్పాట్లపై సమావేశం

గోల్కొండ: బక్రీద్ పండుగ ఏర్పాట్లపై నేడు తపాచబుత్రలోని ఎంకే కన్వెన్షన్ హాల్‌లో సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మోజంఖాన్, కౌసరుద్దీన్ తెలిపారు. సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్, అదనపు డీసీపీ ఎక్బాల్ సిద్ధిఖీ, ఏసీపీలు సయ్యద్ ఫయాజ్, విజయశ్రీనివాస్, మహ్మద్ మునావర్, వివిధ పీఎస్‌ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొంటారన్నారు.

CHANGE OF NAME

I, **SRI NAGA VAJRA LAKSHMI PIDURU** (Old Name), W/o. Piduru Karthikeya, R/o. Block -2, Flat No. 2402, My Home Avatar, Narsingi, Hyderabad - 500 075, Telangana State, India. Hence, I have changed my name to **SRI NAGA VAJRA LAKSHMI KONKEPUDI** (New Name) and hereafter my name is known as **SRI NAGA VAJRA LAKSHMI KONKEPUDI.**

అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో గతంలో తీర్మానాలు చేసి ప్రారంభించిన పనులలో మిగిలిఉన్న వాటిని త్వరలోనే పూర్తి చేస్తామని మణికొండ మున్సిపల్ డీఈ శివసాయి అన్నారు. సోమవారం ఆయన పుప్పాలగూడ శ్మశాన వాటిక, మణికొండ నూతన మున్సిపల్ కార్యాలయాల్లో కొనసాగుతున్న పనులను ఏఈ సంజయ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్మశానవాటికలో సంప్, గ్యాలరీ తదితర పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. మున్సిపల్ కార్యాలయానికి బ్రిక్ వర్క్ పూర్తయి ఫాల్ సీలింగ్, ఫ్లోరింగ్ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. మరో రెండు నెలల్లో పనులన్నీ పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్‌లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



శ్మశాన వాటికలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

శిల్పా లే అవుట్ స్టేజ్-2 ఫ్లైఓవర్ త్వరలో ప్రారంభం

- రూ.446.13 కోట్లతో నిర్మాణం.. ఆరులేన్ల బై డైరెక్షనల్ ఫ్లైఓవర్
- ఎమ్మెల్యే గాంధీ వెల్లడి



కొండాపూర్ వైపు జరుగుతున్న ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: నియోజకవర్గంలో మరో ఫ్లైఓవర్‌ను త్వరలో ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెల్లడించారు. సోమవారం గచ్చిబౌలిలోని ఓఆర్‌ఆర్ జంక్షన్ నుంచి శిల్పా లేఅవుట్ స్టేజ్-2 కొండాపూర్ వైపు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలి ఔటర్ రింగురోడ్డు జంక్షన్ నుంచి శిల్పా లేఔట్ కొండాపూర్ వైపు రూ.446.13 కోట్ల వ్యయంతో ఆరులేన్ల బై డైరెక్షన్ ఫ్లైఓవర్‌లో భాగంగా కొండాపూర్ వైపు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు పూర్తికావొచ్చాయని తెలిపారు. ఔటర్ రింగురోడ్డుకు కనెక్టివిటీని మెరుగుపర్చడమే కాకుండా గచ్చిబౌలి జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ) లో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ఫ్లైఓవర్ పొడవు 816 మీటర్లు , వెడల్పు 24 మీటర్లతో నిర్మించారన్నారు . ఇది హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లకు మధ్య వారధిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు డీఈ హరీష్, ఏఈ శివకృష్ణ ట్రాఫిక్ సీఐ సురేష్, నాయకులు గణేష్‌ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, జంగయ్యయాదవ్, సత్యనారాయణ, చాంద్‌పాషా, శశాంక్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

బోనాలు హిందూ సంస్కృతికి చిహ్నాలు

గోల్కొండ: బోనాలు హిందూ ప్రజల సంస్కృతికి చిహ్నాలు అని లంగర్‌హౌస్‌లోని సంఘం మఠం పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా 1008 అన్నారు. జగదాంబిక మహంకాళి బోనాల ఉత్సవాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కె.చంటిబాబు సోమవారం లంగర్‌హౌస్‌లోని రామ్‌చంద్రజీ మఠాన్ని సందర్శించి రాహుల్‌దాస్ బాబా ఆశీర్వాదం తీసుకున్నారు. బోనాలు విజయవంతం చేయడానికి సహాయ సూచనలు అందించాలని ఈ సందర్భంగా ఆయన బాబాను కోరారు. ఆయనను కలిసిన వారిలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎస్.శ్రీకాంత్, సురేష్‌గౌడ్ తదితరులున్నారు.

వాడవాడలా ఆవిర్భావ సంబురం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అసువులు బాసిన అమర వీరులకు నివాళులర్పించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పలు ప్రాంతాల్లో మిఠాయిలు పంచుకొని సంబరాల్లో పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



పోలీస్ అకాడమీలో ఇన్‌చార్జి జేడీ మురళీధర్



పాల్మాకుల కళాశాల వద్ద ప్రిన్సిపాల్ అనిత



అత్తాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు



కాటేదాన్ బీజేపీ కార్యాలయం వద్ద...



కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాయలంలో...



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి...



నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి



మణికొండ మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9989616273
9010221230